యాదగిరిగుట్టలో శ్రావణ సందడి

ఆలయ క్యూ లైన్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 18 : యాదగిరిగుట్ట పంచనారసింహస్వామివారి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. శ్రావణమాసంతోపాటు ఆదివారం సెలవు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు సందడిగా మారాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవ మూర్తిని అర్చించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. అనంతరం ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 38వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.51,15,581 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పాపన్నగౌడ్ పోరాటం ఆదర్శణీయం

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- జిల్లా వ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

భువనగిరి కలెక్టరేట్ : కలెక్టర్ కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, చిత్రంలో అధికారులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 18 : బడుగు, పేద, బహుజనుల అభ్యున్నతి కోసం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చేసిన పోరాటం అందరికీ ఆదర్శణీయమని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించి మాట్లాడారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకుల కిట్లపై త్వరలోనే శిక్షణ నిర్వహిస్తామని, వారు ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి వెంటనే బీమా చెల్లించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వృత్తుల మీద ఆధారపడిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, ఎక్సైజ్ అధికారి సైదులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహస్వామి పాల్గొన్నారు. భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో పాపన్న గౌడ్ విగ్రహానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ నివాళులర్పించారు.

రాజాపేట : మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేజీకేఎస్ మండలాధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్‌గౌడ్, నాయకులు మహేందర్‌గౌడ్, కేదారిగౌడ్, సత్యనారాయణగౌడ్, యాదగిరిగౌడ్, ఉప్పలయ్యగౌడ్, ప్రవీణ్, నరేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర నాయకుడు చందర్ గౌడ్, నర్సయ్య, సత్యనారాయణ, అంజయ్య, స్వామి, రాజు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సర్వాయి పాపన్న గౌడ్ ఫ్లెక్సీకి కల్లుగీత కార్మిక సంఘం నాయకులు నివాళులర్పించారు. రామ్మూర్తి గౌడ్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రాజు, నర్సింహ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం నాయకులు కొండూరి అజయ్‌గౌడ్, రవీందర్, ఉపేందర్ బోస్, సురేందర్, శివయ్యగౌడ్, ఐలయ్యగౌడ్, స్వామి, ధనుంజయ, సహదేవ్, సాయి, సత్తయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం భవనంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గౌడ సంఘం అధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశం, కార్యదర్శి పోచయ్య, నాయకులు పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

చౌటుప్పల్ : తంగడపల్లి రోడ్డు వద్ద పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఆలేరులో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, నాయకులు

బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక పాపన్న గౌడ్

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట/ఆలేరు రూరల్, ఆగస్టు 18 : బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి భిక్షమయ్య గౌడ్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాదగిరిగుట్టలో గౌడ సత్రం వద్ద, ఆలేరులో పాపన్న గౌడ్ విగ్రహాలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్ కుమార్, సీఐ రమేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, ర్యాకల రాజు, కీసరి బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి పాపన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

చౌటుప్పల్ : పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాల కోసం పాపన్న చేసిన పోరాటాలను గుర్తు చేశారు.

రామన్నపేట : మండల కేంద్రంలో పాపన్న చిత్రపటానికి గౌడ సంఘం నాయకుడు కొన్నె అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు సైదులు, ఉప్పలయ్య, భిక్షం, మల్లేశ్, ప్రభాకర్, పర్వతాలు, నర్సింహ, అక్షిత, శివరాం పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపాలిటీలోని పాపన్న గౌడ్ విగ్రహానికి ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బహుజనుల కోసం పాపన్నగౌడ్ చేసిన త్యాగాన్ని కొనియాడారు.

మున్సిపల్ కో ఆప్షన్ గనగాని నర్సింహ, ఆయా గ్రామాలకు చెందిన గౌడ్ సొసైటీల చైర్మన్లు సత్యం, యాదగిరి, శ్రీధర్, రవిగౌడ్, రాజయ్య, బాలరాజు, యాదగిరి, పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

మోత్కూరు, అగస్టు 18 : ప్రభుత్వం రూ.5.80 కోట్లతో నిర్మాణం చేపట్టిన మోత్కూరు – కప్రాయపల్లి రోడ్డు పనుల పూర్తికి చర్యలు తీసుకోనున్నట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొండగడపలో బోనాల పండుగలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీకి స్థానిక నాయకులు, రాజన్నగూడెం వాసులు అసంపూర్తి రోడ్డు విషయాన్ని తెలిపారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కంకర పోసి పనులను వదిలేయడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్ అండ్ బీ డీఈఈ సురేందర్‌తో రోడ్డు పనుల విషయమై ఆరా తీశారు. రోడ్డు పనుల కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండు పర్యాయాలు ఉన్నతాధికారుల ఆదేశాలతో నోటీసులు జారీ చేశామని, అయినా స్పందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు లెంకల సుజాత, ఎర్రబెల్లి మల్లమ్మ పాల్గొన్నారు.

నర్సారెడ్డి ఆశయాలు భావితరాలకు ఆదర్శం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నర్సారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 18 : ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ మాడుగుల నర్సారెడ్డి ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దగూడెం గ్రామంలో కీర్తి మూర్తి అభిమానులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నర్సారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నర్సారెడ్డి వ్యాపార రంగంలో రాణించడంతోపాటు వందలాది మందికి ఉపాధి కల్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దారని తెలిపారు. స్వగ్రామంలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యనందించేందుకు కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసిన చరిత్ర సీఎం రేవంత్ సర్కారుకు దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, యాదిరెడ్డి, రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశం, నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన ఇస్తారి, పర్వతం లక్ష్మయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. నాయకులు పానుగంటి లింగస్వామి గౌడ్, భూపాల్‌రెడ్డి, రాజారాంగౌడ్, రమేశ్ గౌడ్, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట వాసికి తెలంగాణ ఐకాన్ అవార్డు

యాదగిరిగుట్ట, ఆగస్టు 18 : పట్టణానికి చెందిన హిందూ ఆలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టెగుమ్ముల రవీందర్‌రెడ్డికి తెలంగాణ ఐకాన్–2024 అవార్డు వరించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వాయిస్ స్టూడియో సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును ఆయనకు అందించారు.

డెంగీతో బాలుడు మృతి

ధనుష్ (ఫైల్)

తుర్కపల్లి, ఆగస్టు 18 : మండలంలోని మాదాపురంలో డెంగీతో ఓ బాలుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన బ్రహ్మచారి, పద్మావతి దంపతుల కుమారుడు ధనుష్ (17) వారం రోజుల క్రితం జ్వరంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఎంతకూ జ్వరం తగ్గకపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. దీంతో ధనుష్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించి శనివారం రాత్రి బాలుడు మృతిచెందాడు. బ్రహ్మచారి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉండగా.. చేతికొచ్చిన కొడుకు చనిపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

వీధి కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 18 : మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బొమ్మగాని ఎల్లమ్మ ఆదివారం కిరాణం షాపునకు వెళ్తుంటే కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గేదెల పైనా దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొలనుపాకలో పశువుకు వైద్యం చేసే శిల్పం

పశువుకు వైద్యం చేసే శిల్పాన్ని పరిశీలిస్తున్న చారిత్రక పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

లేరు రూరల్, ఆగస్టు 18 : మండలంలోని కొలనుపాక సోమేశ్వరాలయ ప్రాంగణంలో పశు వైద్యానికి సంబంధించిన అరుదైన శిల్పాన్ని ఆదివారం గుర్తించామని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కూటులు, చాళుక్యుల కాలంలో కొలనుపాక గ్రామంలో ఏనుగులు, గుర్రాలతోపాటు పశు సంపద సంవృద్ధిగా ఉండేదని, ఇందులో భాగంగా యుద్ధ సమయంలో గాయపడిన వాటికి చికిత్స అందించేవారని తెలిపారు. మహాభారత కాలంలో సకల సహజీవులు గుర్రాలకు, పశువులకు వైద్యం అందించినట్లు చరిత్ర శాసనాలు చెబుతున్నాయని, గతంలో వెలుగుచూసిన కడప జిల్లాలోని వెలగటూరు గ్రామంలో పశువైద్యానికి సంబంధించి శాసనంలో సహదేవుని ప్రస్థావన ఉందని చెప్పారు. ఇందులో భాగంగానే సోమేశ్వరాలయం నంది మండపంలో ఆలయ ద్వారానికి ఎడమ వైపున పశువైద్యుని శిల్పం ఉందన్నారు. అప్పట్లో పశు వైద్యులకు సముచిత గౌరవం ఇచ్చే వారని పేర్కొన్నారు.

డీసీసీబీ బ్రాంచ్ మంజూరు హర్షణీయం : చందర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 18 : డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సహకారంతో ఆత్మకూరు(ఎం) మండలానికి నల్లగొండ కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్‌ను మంజూరు చేయడం హర్షణీయమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు మండల బ్రాంచ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భగా గొంగిడి మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉండి ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు కూడా సరిగా రుణమాఫీ చేయకుండా మాయమాటలు చెప్తుందని విమర్శించారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు భిక్షపతి, రమేశ్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకన్న, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అరుణ, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అజీమొద్దీన్, రాజు, నర్సయ్య, సాయిలు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్‌కు పలువురి పరామర్శ

రాజాపేట, ఆగస్టు 18 : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ సోదరుడు కనకేశ్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు కనకేశ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు బాలలక్ష్మి, నాయకులు రాంరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జ్యోతి, భాస్కర్‌గౌడ్, జశ్వంత్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

- బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ బండారు జయశ్రీ

బాధితులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు

మోటకొండూర్, ఆగస్టు 18 : మైనార్టీ తీరని బాలికలకు వివాహాలు జరుపడానికి ప్రయత్నిస్తే బాల్య వివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాలల సంక్షేమ సమితి జిల్లా చైర్‌పర్సన్ బండారు జయశ్రీ అన్నారు. మండలంలోని తేర్యాల గ్రామంలో ఓ వ్యక్తి తన మేనకోడలికి ఆదివారం బాల్య వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ లైన్ (1098)కు సమాచారం రావడంతో వెంటనే జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, పోలీసులతో కలిసి జయశ్రీ అక్కడకు చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ తేర్యాలలో బాల్య వివాహాన్ని నిలిపివేసి బాలుడు, బాలికకు, వారి తల్లిదండ్రులకు భువనగిరి బాలల పరిరక్షణ కేంద్రంలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. రక్షణ నిమిత్తం బాలికను తాత్కాలికంగా ప్రస్తుతం సఖీ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. చిన్నతనంలో ఆడ పిల్లలకు పెండ్లిళ్లు చేసి చదువుకు దూరం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యుడు మల్లేశ్, ఇస్తారి, రుద్రమదేవి, శివరాజ్, అధికారి పులుగుజ్జు సైదులు, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ దశరథ, సూపర్‌వైజర్ బాలాంజలి పాల్గొన్నారు.

మొరిపిరాల వాసికి రవీంద్రనాథ్ ఠాగూర్ సేవా పురస్కారం

రవీంద్రనాథ్ ఠాగూర్ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న చంద్రస్వామి

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 18 : మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన ఎన్‌కేఎస్ (నల్ల కృష్ణస్వామి నెట్‌వర్క్ నాలెడ్జ్ ఫౌండేషన్) చైర్మన్ నల్ల చంద్రస్వామికి హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వల్లూరి, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూరు సేవా పురస్కారాన్ని అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు రైతులు, మహిళలు, యువజనుల హక్కులపై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్య పరుస్తుండడం వంటి సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు చంద్రస్వామి తెలిపారు. తెలంగాణ ఉద్యమ కళాకారుడు నల్ల కృష్ణస్వామి ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్‌తో ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని చంద్రస్వామి పేర్కొన్నారు.

చేనేత కార్మికులకు ప్రత్యేక పాలసీ రూపొందించాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్

మోత్కూరు, ఆగస్టు 18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో నిర్వీర్యమైన చేనేత పరిశ్రమను ప్రత్యేక పాలసీ రూపొందించి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి కాలనీలో ఆదివారం జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పదేండ్ల పాలనలో చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన చేనేతకు చేయూత, చేనేత మిత్ర, చేనేత బీమా పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు కూరపాటి రాములు, పసునూరి యాదయ్య, లక్ష్మి, శ్రీను, రమేశ్, పరశురాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మాటల ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 18 : రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత లేదని, మాయమాటలు చెబుతూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు సరైన బుద్ధి చెబుతారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రుణమాఫీకి రూ.31వేల కోట్లు కేటాయించి మూడు విడుతల్లో కేవలం రూ.17వేల కోట్లనే రైతుల ఖాతాల్లో జమ చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. సగానికిపైగా రైతులకు ఇప్పటి వరకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా మద్దెలమ్మ బోనాలు


భువనగిరి అర్బన్ : పోచమ్మ వాడలో పోచమ్మ అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


చౌటుప్పల్‌లో మద్దెలమ్మ అమ్మవారికి బోనాలు తీస్తున్న మహిళలు

చౌటుప్పల్, ఆగస్టు 18 : పట్టణంలోని మరుద్వతి (మద్దెలమ్మ) అమ్మవారి దేవాలయం 8వ వార్షిక బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పద్మశాలీ మహిళలు బోనాలతో బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు(ఎం)/మోటకొండూరు : మోటకొండూరు మండల కేంద్రం, ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంతో పాటు కొరటికల్, కూరెళ్ల, రహీంఖాన్‌పేట, పారుపల్లి తదితర గ్రామాల్లో బోనాలు తీశారు. ఈ సందర్భంగా బీరప్ప, ఎల్లమ్మ, మైసమ్మ, మారెమ్మ, పోచమ్మకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని ప్రగతినగర్, శృతినగర్, అర్బన్ కాలనీతోపాటు పలు కాలనీల్లో బోనాల పండుగను జరుపుకొన్నారు. అర్బన్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు బోనాలు సమర్పించారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని పెద్ద రావులపల్లి, జూలూరు, జగత్‌పల్లి, జలాల్‌పూర్, పోచంపల్లి తదితర గ్రామాల్లో పోచమ్మ, కాటమయ్య బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మోటకొండూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆత్మకూరు(ఎం) కొరటికల్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

వైద్యురాలి హత్య కేసు దుండగులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ

యాదగిరిగుట్టలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 18 : కోల్‌కతా పట్టణంలో యువ వైద్యురాలిని హత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ అన్నారు. యాదగిరిగుట్టలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇలాంటి ఘటనలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకొని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, నాయకులు మహేందర్, పెంటయ్య, బీసీ హక్కుల సాధన సమితి మండలాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : ఆలేరులో సీపీఐ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ మాట్లాడుతూ దోషులను గుర్తించి ఉరి తీయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, ఆంజనేయులు, స్వామి, బలరాం పాల్గొన్నారు.

విరబూసిన రాఖీ పుష్పాలు

ఆత్మకూరు(ఎం)లో విరబూసిన రాఖీ పుష్పాలు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 18 : మండల కేంద్రానికి చెందిన సోలిపురం అరుణ ఇంటి వద్ద, పొన్నగాని జహంగీర్‌గౌడ్ ఫంక్షన్ హాల్ వద్ద విరబూసిన రాఖీ పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి. రాఖీ ఆకారంలో ఉండే ఈ పుష్పాలను పంచ పాండవులు, కౌరవ పాండవులు, కురుక్షేత్ర పుష్పాలని కూడా అంటారు. ఈ పుష్పానికి చుట్టూ వంద రెక్కలు ఉండడంతో కౌరవులని, మధ్యలో ఉండే 5 రెక్కలను పాండవులని, నడి మధ్యలో ఉండే ఒక రెక్కను కృష్ణుడు, బ్రహ్మగా వర్ణిస్తూ ప్రజలు పూజలు చేస్తుంటారు.